# పోలింగ్ కేంద్రాలకు తరలిన ఎన్నికల సామగ్రి

- 'తూర్పు'లో 2,54,641 మంది ఓటర్లు
- పురుషులు 1,24,493, మహిళలు 1,29,810, ఇతరులు 338
- 230 పోలింగ్ కేంద్రాలు, 89 లొకేషన్లు, 21 సెక్టార్లు, 17 రూట్లు
- ప్రతి పోలింగ్ కేంద్రం వెబ్‌కాస్టింగ్, 57 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు
- బరిలో 29 మంది అభ్యర్థులు, ప్రతి పోలింగ్ కేంద్రంలో రెండో ఈవీఎం
- పోలింగ్ నిర్వహణకు 1,056 మంది పీవోలు, ఏపీవోలు, ఓపీవోల నియామకం
- 12 ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు
- నేడు పోలింగ్‌కు సర్వం సిద్ధం




వరంగల్ ఎనుమాముల మార్కెట్‌లో ఈవీఎంలు, ఎన్నికల సామగ్రిని చెక్ చేసుకుంటున్న పోలింగ్ అధికారులు

వరంగల్, నవంబర్ 29 (నమస్తేతెలంగాణ): శాసనసభ ఎన్నికల పోలింగ్‌ను ప్రశాంతం, సజావుగా నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ప్రతి పోలింగ్ కేంద్రంలో అవసరమైన వసతులు కల్పించారు. మహిళలు, యువత, దివ్యాంగుల కోసం ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈవీఎంలు, ఇతర ఎన్నికల సామగ్రితో పోలింగ్ అధికారులు, సిబ్బంది బుధవారం సాయంత్రం పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. గురువారం పోలింగ్ నిర్వహణ కోసం ప్రతి పోలింగ్ కేంద్రంలో నిబంధనలకనుగుణంగా సన్నాహాలు చేశారు. 29 మంది అభ్యర్థులు తూర్పు నియోజకవర్గం నుంచి ఎన్నికల బరిలో నిలిచారు. హోరాహోరీగా సాగిన ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు ముగిసింది. ఈ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పోటీలో ఉన్నారు. నేడు ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగనుంది. వరంగల్‌తూర్పు నియోజకవర్గంలో 2,54,641 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,24,493, మహిళలు 1,29,810, ఇతరులు 338 మంది ఉన్నట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. వీరితోపాటు సర్వీసు ఓటర్లు 85, ఎన్నారై ఓటర్లు 25 మంది ఉన్నారు. సర్వీసు ఓటర్లలో పురుషులు 82 మంది, మహిళలు ముగ్గురు, ఎన్నారై ఓటర్లలో పురుషులు 19, మహిళలు ఆరుగురు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ నియోజకవర్గంలోని మొత్తం ఓటర్లలో మహిళలే ఎక్కువ మంది ఉండడం విశేషం.

### 230 పోలింగ్ కేంద్రాలు

పోలింగ్ నిర్వహణ కోసం తూర్పు నియోజకవర్గం పరిధిలో 230 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి షేక్ రిజ్వాన్ బాషా తెలిపారు. 89 లొకేషన్లలో ఈ పోలింగ్ కేంద్రాలు పనిచేస్తాయని వెల్లడించారు. 230 పోలింగ్ కేంద్రాల్లో 57 కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించామని, వీటితో సహా 230 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ చేసినట్లు వివరించారు. ప్రతి క్రిటికల్ పోలింగ్ కేంద్రంతోపాటు మూడు కంటే ఎక్కువ పోలింగ్ కేంద్రాలు ఉన్న ప్రతి లొకేషన్‌లో బయట కూడా కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ పోలింగ్ కేంద్రాల వద్ద కేంద్ర బలగాలు బందోబస్తు నిర్వహిస్తాయని తెలిపారు. 230 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారులు 21 సెక్టార్లుగా గుర్తించారు. 17 రూట్ల ద్వారా పోలింగ్ పర్యవేక్షణకు ఏర్పాట్లు చేశారు. 1,056 మంది పోలింగ్ అధికారులు, సిబ్బంది నియమితులయ్యారు. వీరిలో ప్రిసైడింగ్ అధికారులు 264, అసిస్టెంటు ప్రిసైడింగ్ అధికారులు 264, ఇతర ప్రిసైడింగ్ అధికారులు 528 మంది ఉన్నారు. వీరికి పోలింగ్ నిర్వహణపై ఎన్నికల అధికారులు శిక్షణ ఇచ్చారు. పోలింగ్ నిర్వహణ కోసం 110 మంది మైక్రో అబ్జర్వర్లు నియమితులయ్యారు. 29 మంది పోటీలో ఉండడం వల్ల ఈ నియోజకవర్గంలో పోలింగ్ నిర్వహణకు రెండో ఈవీఎం ఏర్పాటుకు ఎన్నికల సంఘం నిర్ణయించింది. దీంతో ప్రతి పోలింగ్ కేంద్రంలో రెండు ఈవీఎంల ద్వారా పోలింగ్ జరుగనుంది. పోలింగ్ అధికారులు, సిబ్బందికి ఎన్నికల అధికారులు బుధవారం వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ గోదాముల వద్ద బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్లు అందజేశారు. రవాణా కోసం బస్సులు, కార్లను కూడా సమకూర్చడంతో పోలింగ్ అధికారులు, సిబ్బంది ఎన్నికల సామగ్రితో నియోజకవర్గంలోని 230 పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కానున్నందున ప్రతి పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు చేశారు.




ఎనుమాముల మార్కెట్‌లో ఈవీఎం, వీవీప్యాట్లతో బస్సు ఎక్కుతున్న పీవో, ఏపీవోలు

### ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు

తూర్పు నియోజకవర్గంలో మహిళలు, యువత, దివ్యాంగులు, మోడల్ కోసం ప్రత్యేకంగా పన్నెండు పోలింగ్ కేంద్రాలను తీర్చిదిద్దారు. ఎల్బీనగర్‌లోని ఎస్‌ఆర్ జూనియర్ కాలేజీ, లర్నర్స్ లాండ్ హైస్కూల్, గిర్మాజిపేటలోని ప్రభుత్వ ఎయిడెడ్ వివేకానంద జూనియర్ కాలేజీ, వరంగల్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్, అబ్బనికుంటలోని ప్లాటినం జూబ్లీ హైస్కూల్‌లో ఒక్కో ఆదర్శ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. వీటితోపాటు మహిళల కోసం కొత్తవాడలోని గోల్డెన్ ఓక్ స్కూల్, మండిబజార్‌లోని కిడ్డీకూప్ స్కూల్, గిర్మాజిపేటలోని ఓల్డ్ గ్రెయిన్ మార్కెట్, ఉర్సులోని ప్రభుత్వ ఎయిడెడ్ శ్రీవెంకటేశ్వర హైస్కూల్, శంభునిపేటలోని ప్రభుత్వ హైస్కూల్‌లో మహిళా పోలింగ్ కేంద్రాలను నెలకొల్పారు. కరీమాబాద్‌లోని కౌటిల్య హైస్కూల్‌లో దివ్యాంగులు, దేశాయిపేటలోని సీకేఎం అండ్ సైన్స్ కాలేజీలో యూత్ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ ప్రత్యేక పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు, మహిళలు, దివ్యాంగులు, యువతకు బెలూన్లు సహా భారీగా స్వాగత ఏర్పాట్లు చేశారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు పోలీసులు ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఈ నియోజకవర్గంలో వరంగల్ ఏసీపీ బోనాల కిషన్ బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు.



పీవో, ఏపీవోలను తరలిస్తున్న బస్సులు




మండిబజార్‌లోని కిడ్డీకుప్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం




ఎల్బీనగర్‌లోని ఎస్‌ఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రం



ఫ్రెంచ్ ఫెయిర్ సర్టిఫికెట్లతో విద్యార్థులు

## తాళ్ల పద్మావతిలో ఫ్రెంచ్ ఫెయిర్

కరీమాబాద్, నవంబర్ 29: ఉర్సు బైపాస్ రోడ్డులోని తాళ్ల పద్మావతి ఇంటర్నేషనల్ పాఠశాలలో బుధవారం ఫ్రెంచ్ ఫెయిర్ నిర్వహించారు. ఈ సందర్భంగా తాళ్ల పద్మావతి విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం మాట్లాడుతూ తమ పాఠశాలలో ఇతర భాషలతోపాటు ఫ్రెంచ్ భాషను సైతం నేర్పుతున్నామన్నారు. దీంతో విద్యార్థులు ఫ్రెంచ్ భాషలో సైతం తమ ప్రతిభను చూపుతున్నారన్నారు. ఫ్రెంచ్ ఫెయిర్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ తాళ్ల వరుణ్-వైష్ణవి, ప్రిన్సిపాల్ స్వర్ణ, ఫ్రెంచ్ భాష శిక్షకుడు ఉషశ్రీ, మాన్య, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



కల్లు కుండలకు ట్రేలు కడుతున్న గీత కార్మికుడు

## కల్లు కుండలకు రక్షణ కవచాలు

కరీమాబాద్, నవంబర్ 29: పక్షులు, కోతులతోపాటు దొంగల నుంచి చెట్టుపై తాటికల్లును రక్షించుకునేందుకు గీత కార్మికులు వినూత్న ప్రయత్నాలు చేస్తున్నారు. కల్లు కుండలకు రక్షణగా ట్రేలు ఏర్పాటు చేస్తున్నారు. ఉర్సు చెరువు కట్టపై ఉన్న తాటివనంలో గీత కార్మికుడు రాజు బుధవారం తాటిచెట్టు ఎక్కి ఇలా కల్లు ఉన్న కుండలకు ట్రేలు ఏర్పాటు చేశాడు. కల్లు దొంగతనాలను గుర్తించి రక్షణకు కుండల చుట్టూ ట్రేలు ఏర్పాటు చేసినట్లు రాజు చెప్పారు.

# పోలింగ్ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్

హనుమకొండ, నవంబర్ 29: జిల్లాలోని వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో పలు పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ బుధవారం సాయంత్రం సందర్శించారు. కాజీపేటలోని సెయిం ట్ ఆన్స్ హైస్కూల్లో ప్రత్యేకంగా ఏర్పా టు చేసిన యూత్ మేనేజ్డ్ పోలింగ్ కేంద్రాన్ని, గోపాల్‌పూర్‌లో బేబీ సైనిక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఉమెన్స్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి, అక్కడ కల్పించిన వసతులను ఆమె పరిశీలించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయి ఏర్పాట్లు చేసిన ట్లు సిక్తా పట్నాయక్ తెలిపారు. పోలింగ్ కేంద్రంలో విద్యుత్ సౌకర్యం, ఫర్నిచర్, నీటి వసతి, వృద్ధులు, దివ్యాంగుల కోసం ర్యాంపులను కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రానికి వచ్చే ఓటర్లకు స్వాగతం పలికేలా బెలూన్లతో ఆకట్టుకునేలా ముస్తాబు చేశారు. ఓటేసేందుకు వచ్చే యువ ఓటర్లకు పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్ల గురించి అధికారులు, పోలీసులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఏర్పాట్లపై ఎన్నికల సిబ్బందిని అభినందించారు.

### వెబ్ కాస్టింగ్ ప్రక్రియ పరిశీలన

అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైన పోలింగ్ రోజున వెబ్ కాస్టింగ్ సక్రమంగా, సంపూర్ణంగా జరిగేలా సంబంధిత బాధ్యులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ ఆదేశించారు. గురువారం ఉదయం ప్రారంభం కానున్న పోలింగ్ ప్రక్రియ పర్యవేక్షణ కోసం హనుమకొండ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ ఏర్పాట్లు వంద శాతం పక్కాగా ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల వాహనాల్లోని జీపీఎస్ ట్రాకింగ్, సర్వైలెన్స్ ప్రక్రియ, పోలింగ్ సిబ్బంది, వారి విధుల నిర్వహణలో సంబంధిత నోడల్ అధికారులు పూర్తి అలర్ట్‌గా ఉండాలన్నారు. పోలింగ్ ప్రక్రియకు సంబంధించిన నివేదికలను సమయానుసారంగా పంపించాలని కలెక్టర్ సూచించారు.




కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్‌ను పరిశీలిస్తున్న సిక్తా పట్నాయక్